


# ప్రత్యక్ష దైవం

వప్పు & యం. వి. ఆర్.

ఆ వర్షంలో వీపూ వీపూ అనుకొనికూర్చున్న 'ఝూలా' ఎడ్వర్టయిజుమెంటు బొమ్మలే ఎదురుగుండా ఉన్న గోడ మీద నవ్వుముఖాలతో ఉన్నాయి, తక్కిన ఊరంతా ఆ బ్రహ్మాండవర్షాన్ని భరించలేకపోయింది కారుమబ్బు పట్టి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆ ఒక్క శెలవురోజు ఆదివారంకూడా ఎక్కడికి వెళ్ళడానికి వీలు లేకపోయింది ఆఫీసులో కూర్చుని చాకిరీచేస్తే తోస్తుంది గాని యింటిదగ్గర అలా ప్రొద్దున్నించి కూర్చుంటే ఏమీ తోచక చికాగ్గావుంది ఆ విసుగుతో యింట్లో రామం ఏడుస్తే 'సూర్యం' పై కేకలేసేను.

"రామం నొకసారి ఆడించకూడదూ" అని విసుగ్గా అనేసరికి అసలే విసిగివుందేమో ఒక్కసారి తన ఉడుకు బోత్తనం అంతా తీరేలాగు ఒక లెక్చరిచ్చింది.

"ఇటువంటివాళ్ళకు పిల్లల్నిచ్చిన ఆ దేవుడ్నననాలి. పిల్ల లంటే ముద్దూలేదు ముచ్చటాలేదు. కొందరు మొగాళ్ళు చక్కగా పిల్లల్ని ఎత్తుకొని ఆడిస్తారు. అది ఆడదాని అదృష్టం అసలు యింట్లో ఉండడానికే తీరుబడిలేని ఉద్యోగమాయె. ఇంట్లోవుండే ఆదివారంనాడుకూడా పిల్లల్ని చేరతీయకపోతే ఎలాగు ?"

పిల్లల విషయంలో సూర్యానికి పిచ్చి ఎక్కువయింది. పిల్లలమీద బాధ్యత మొగాళ్లు అక్కరలేదని పట్టించుకో రంటుంది.

ఎంతచేసినా తరగని ఆఫీసు చాకరీ తలమ్ముకొన్న తరువాత చేయవలసిందే ఇంక పిల్లల్నితీయడం, ముద్దూ ముచ్చటలు చేయడం ఎలా సాగుతుంది

ఈ విషయంలో యింక వాదిస్తే లాభములేదని తప్పిం చుకుందుకు "యింటిదగ్గర యింక కూర్చోకూడదు. ఏదో ఆపూటకువచ్చి రెండు మెతుకులు తిని వీధిలోకివెళ్ళి రాత్రి ఏ పదింటికో అంత సర్దుబాటూ జరిగేక కొంపకి రావాలి లేకపోతే యీ గోలంతా పడ్డం కష్టం" అన్నాను

"మీరు అలా అంటారుకాని పిల్లలున్న యిల్లు గోలగా కాక ఎలా ఉంటుందండీ ! నేనెలా వేగుతున్నానో ఆ భగ వంతుడికే తెలియాలి ఇంకా మీరేనయం అందరి మొగాళ్ల లాగ పిల్లలతో బాధపడరు" అంటూగదితలుపులు తాళాలు వేసి సావిట్లో మంచం వాల్చుకుని 'శశి'ని పక్కలో వేసు కొని పడుకుంది రామం, పెద్దబ్బాయి నా కుర్చీదగ్గర మంచంమీద పడుకొని నిద్రపోతున్నారు

ఇంక ఏదో పిచ్చాపాటిపెడితే ఊసుపోతుందని 'ఏమిటో ఆ నయం నాకేమీ అర్థంకావడం లేదు' అన్నాను

"వెయ్యిచెప్పండి లక్ష చెప్పండి మీకు మొదటినుండీ పిల్లలంటే చికాకే, మీకు కోపంవస్తే వచ్చిందికాని "

"పోనీ నాకు పిల్లలంటే అసహ్యమే ! వాళ్ళను నువ్వే ఆదరించి పెంచుకుంటున్నావు సరేనా."

"అదిగో, అలా అంటే యిలా అంటారు పిల్లలంటే మీకూ అభిమానముంది. కాని వాళ్ళను చేరదీయరని అంటున్నాను."

"అవును, చేరదీయను. నాకు పిల్లల్ని చేరతీయకుండానే గడిచిపోతోంది చంటిగుడ్డు నెత్తుకోడం నాకు చేతకాదు చేతకానిదీ ఎత్తుకుంటే ఏమెదో విరుగుతే చావాలి. కొంచెం పెద్దవాళ్ళయేక వాళ్ళు నీవెనకాలేపడి తిరుగుతారు. అందు వల్లే పిల్లలు నాదగ్గరకురారు."

"అదే నేనూ అన్నాను మొగాడికి అలా జరగడం మంచిదే కాని చేసుకోలేక నేను గోలపెడుతున్నాను. నేను ఊరికే గోలపెట్టడమే కాని మీరు పిల్లల్ని తీయడం వట్టి మాట ఆఖరుకి మీరు పెళ్ళిలో 'పాన్పు'మీద చందనం బొమ్మనుకూడా ఎత్తుకోలేదు."

టీచరు —(ఇంగ్లీషు గ్రామరుచెప్తూ) 'ఆమె పది దినములనుండి మలేరియాజ్వరముతో బాధపడు చున్నది' (అని ఇంగ్లీషులోచెప్పి) 'ఆమె' ఏ కేసులో నున్నదిరా రంగా ?—

రంగ —(కొంచంసేపు ఆలోచించి) సీరియస్ కేసులోనండీ మేష్టారూ !

టీచరు —ఛా ! వెధవా ! నువ్వెరా ? భీమూ !

భీము —(తొందరగా) హోప్లెస్ కేసులోనండీ !

బి వి వి. ఆర్. సుబ్బారావు.

సూర్యం పాత విషయాలన్నీ ఒక్క పొల్లయినా పోకుండా పూసగుచ్చినట్టు చెపుతుంది కథ రసగంధాయ ములో పడింది దీనికి ఎలాగూ ఎదో చేటభారతం అంత విషయం చెపుతుంది అనుకొని 'ఏంజరిగింది' అన్నాను

మీకన్నీ మరుపేనండీ అని మొదలుపెట్టింది పెళ్ళిలో జరిగిన సంగతిని,

"ఆవేళ పెళ్ళిలో 'పాన్పు' వేసేరు చందనబొమ్మను ఉయ్యాలలోపెట్టి 'వసంతం' పోసేరు మీ లక్ష్మి అక్కయ్య చందనబొమ్మను మా తమ్ముడు ఆఫీసుకి వెళ్లాలి మీ అబ్బా యిని అందుకో అంటూ అందించింది నేను గౌరీపూజ చేసుకోవాలి పిల్లాడ్ని తీసికోండి అని మీ కందిస్తే మీరు వేడుకచూడ్డానికి దగ్గరే నిలబడ్డ మా అమ్మమ్మను ఏమం దోయి మీ మునిమునమడ్ని ఎత్తుకోండి అని పురమా యించేరు ''

నేను గర్వంగా ఓ చిరునవ్వునవ్వి ఊరుకున్నాను. "అప్పుడు నేను చిన్నదాన్నయేను లేకపోతేనా" అంది.

"ఏమిచేద్దువు" అన్నాను కొంటెగా నవ్వుతూ.

"అదే మనగొప్ప. ఈ తెలివి తేటలే అప్పుడువుంటే మిమ్మల్ని మూడు చెరువుల నీళ్ళు తాగిద్దును చెప్పక పోవడమెందుకు పుట్టిన పిల్లల్ని మిమ్మల్నే ఎత్తుకోమందా మనుకొన్నాను. అబ్బో మీచేతే" అంది.

సాధారణంగా ఆడవాళ్లు వాళ్ళ ఓటమికి ఒప్పుకోరు. కాని మా సూర్యం తాను ఓడినవిషయంలో ఓడిపోయి నట్లు ఒప్పుకుంటుంది. ఆ విషయము పందెమువేసినాసరే లేక తాను మనసులో అనుకున్నా సరే.

ఇంతలో 'శశి' పడుకుంది రామం లేచి ఏడుస్తూంటే వాడినిలేపి మంచినీళ్ళు త్రాగించి జోగొట్టింది.

మాట్లాడుతూంటె మధ్య ఎదేనా పనిచేయడానికి కొం దరు విసుక్కుంటారు. ఆ పనిలో వాళ్ల మాట్లాడుతూన్న విషయం మరుస్తారు పిల్లలు అల్లరిచేస్తూంటే కొందరు మాట్లాడుకోలేరు వాళ్ళను కేకవేసేసరికి మాట్లాడుతూన్న విషయం మరుస్తారు కాని సూర్యం ఒక్కవిషయాన్నే మధ్య మధ్య అవుసరమైతే కొన్నిగంటలు పనిచేస్తూ తీరు బడి సమయంలో వెనుకచెప్పినదాని తరువాయి చెపుతుంది.

ఆ విషయాన్నే యింకో నెలపోయిన తరువాత అడి గినా అదే సమాధానం యిస్తుంది.

ఆ విషయం అప్పటికి వదలినా దాని ప్రస్తావన మళ్ళీ వస్తుందని నాకు తెలుసు

అమ్మయ్య పిల్లలు పడుకున్నారని వంటింట్లో మర చెంబు నీళ్లతీసి తాళము వేసివచ్చి సావకాశంగా కూర్చుంది

"ఎలా పడుకున్నారో పిల్లలు" అన్నాను పిల్లలవేపు చూస్తూ

కొందరికి పిల్లలిని ఏడిపిస్తేనేగాని ముద్దురాదు ఆడు కుంటున్న పిల్లల్ని కసరి ఏడిపించి ముద్దుపెట్టుకుంటారు నాకు నిద్రపోతూన్నపిల్లల్నిచూస్తే ముద్దు నేనప్పుడేపిల్లల్ని ముద్దుపెట్టుకుంటాను సూర్యానికి కోపమూ వస్తుంది.

"మీకు వాళ్ళు పడుకున్నపుడుకాని ముద్దురాదు వాళ్ళు ఏడుస్తూంటే ఒకసారి అయినా తీయరు."

"ఏడుస్తూంటే తీయడమేమిటి పోనిస్తూ నాకుచికాకు"

"వాళ్ళు ఆడుకున్నపుడు, పడుకొనే అప్పుడు మీరు తీయడమెందుకు ? మీకు ముద్దుముచ్చటా ఉండదు. వాళ్లు ఏడుస్తూంటే తీసి చంకనుపెట్టరు మరచిపోయేను. అలా అంటే మీకు కోపంవస్తుంది."

''సరే నీయిష్టంవచ్చినట్లల్లా అను నాకు పోయింది దేమీలేదు ''

''ఇష్టంవచ్చినట్లు అని నేను లేనిదేమీ అనడములేదు, మీకు కోపంవస్తే వచ్చిందికాని ''

"నువ్వు ఉన్నమాట్లే అంటే పెద్దబ్బాయి ముద్దు ముచ్చ ట్లకేమి తక్కువో చెప్పుచూదాము."

అన్నమాటకు నిదర్శనంచూపించి తీరాలి చూ సూ

ర్యంతో తనుమాటంటే నిదర్శనంచూపిస్తుంది. ఒకళ్లంటే నిదర్శనం చూపిస్తేకాని నమ్మదు ఆమాట పడనియ్యదు.

అలా అనగానే వెంటనే సమాధానం లేకపోవడం మూలాన ఆ ఏదో ఆలోచిస్తూండాలి అనుకుంటూ సూర్యం ముఖంలోకి చూస్తున్నాను

"నిజం చెప్పాలంటే పెద్దవాడికి మీరేమీ ముద్దూ ముచ్చటా జరపలేదు కావలిస్తే ఎన్నో సందర్భాలున్నాయి ముద్దూ ముచ్చట్లు జరగనివి"

"సరే. ఏమిటో చెప్పు"

"మీకు ఎప్పటి కప్పడే మరుపు అందరూ మొదటి పిల్లాడికి ఎంతో ముద్దూ ముచ్చటా జరుపుతారు."

"సంగతేమిటో చెప్పమంటే అలా అనవసరప్రశ్నలూ సంభాషణా ఎందుకూ"

"ఏమీ తెలీనట్టే పిడివాదన!"

"ఏమిటో చెప్పు"

"ఎంత ముద్దుగా చేసేరు! పెద్దబ్బాయి అన్నప్రాశన.

"ముద్దుకేం తక్కువ"

"ఏమీలేదు"

"ఏదో చెప్పు. కావలసినవి నాలుగూ యింట్లో పడేసేను ముహూర్తం పెట్టించుకొచ్చేను అన్నప్రాశనకి వెండిగిన్నె కొని తెచ్చేను మీవాళ్ళు రాలేదుకాని రమ్మని ఉత్తరంవ్రాసేను ఇంకేమిచేయాలి?"

"అసలయినదే చేయలేదు అబ్బాయి ఆవేళ ఏమి ముట్టుకున్నాడోచూసేరా? వెంటనే ఆఫీసుకి పరుగెత్తేరు"

చేసినపనిని అప్పుడు ఖండించలేదని సంతోషించడానికి వీల్లేదు సూర్యంతో పుష్కరమయిన తరువాతకూడా దాన్ని విమర్శిస్తుంది ఆ విమర్శనకు సమయం రావాలి, అంత వరకు వేచివుంటుంది లేకపోతే ఎప్పుడు పెద్దబ్బాయి అన్నప్రాశన, దాదాపు పుష్కరం క్రిందటిమాట ఇప్పుడు లేచింది దానిమీద విమర్శ.

(ఇంకావుంది)




కేశ్ రీన్

హేర్ టానిక్ వాడితే

అందం! అందం!! ఆనందం!!

ఆందముంటేనే ఆనందం-

చూచారా నెమిలి ఎంత హాయిగా ఆడుతోందో ఆ ఆనందాన్ని తాను అనుభవించడమే కాకుండా ఇతరులుకూడా అనుభవించేటట్టు చేస్తోంది అలాగే నల్లగా, అందంగా, దుబ్బులా పెరిగే తలవెండ్రుకలను బర్మాముడివేసి అర్ధ చంద్రాకారంగా రంగు రంగు పువ్వులు దానిమీద ధరించే స్త్రీ యెంతో ఆనందాన్ని అనుభవిస్తుంది ఆ సౌందర్యముచూచి ముగ్ధులుకానివా రుంటారా! ఇంత ఆనందము ఇస్తున్నవి ఆమె కేశరములే కేశములు దిటవుగా, దుబ్బులా పెరుగ నిచ్చేది కేశ్ రీన్ హేర్ టానిక్ ఒక్కటే వెల సీసా 0-12-0.

వివరములకు — విక్టోరియా డిపో,

నార్త్ మాడా స్ట్రీట్, మైలాపూరు, మద్రాసు.